క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ జి.సాంబరెడ్డి తెలిపారు. ప్రశాంత్ నగర్, సిద్ధార్థ నగర్, రిజిస్ట్రేషన్ కార్యాలయం, పీజీఆర్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

ఐఎన్‌టీయూసీ ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నిక


సుదర్శన్ గౌడ్, చైర్మన్


బుచ్చిరెడ్డి, కన్వీనర్

ఎంజీఎం: ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం ఐఎన్‌టీయూసీ -3194 యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్‌గా బత్తిని సుదర్శన్‌గౌడ్, కన్వీనర్‌గా చాడ బుచ్చిరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్యాంసుందర్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ బొందుగుల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

వృద్ధమిత్ర వృద్ధుల కార్యవర్గం



మడికొండ: వృద్ధ మిత్ర సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని వృద్ధమిత్ర వృద్ధుల స్వచ్ఛంద కమిటీని గురువారం ఎన్నుకున్నారు. సభ్యులుగా మూల అయిలయ్య, నిగ్గుల సాంబయ్య, కుక్కల సమ్మయ్య, మానుపాటి వెంకటయ్య, మచ్చ పుష్పలీలతో జిల్లా కార్యదర్శి తేరాల యుగేందర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌ను సన్మానించారు. తల్లిదండ్రుల పోషణ సంరక్షణ చట్టం -2007, నియమాలు -2011ను అనుసరించి వృద్ధుల నుంచి వచ్చే ఫిర్యాదులను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించాలని పోలీసు అధికారులను కోరారు.

సుబేదారి పాఠశాల విద్యార్థికి బాసరలో సీటు



విద్యారణ్యపురి: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించిన హనుమకొండ సుబేదారిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.నిధి బాసరలో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు హెచ్‌ఎం గుగులోతు నెహ్రూ నాయక్ గురువారం తెలిపారు. ఈమేరకు ఆ విద్యార్థిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

మహిళపై కుక్కల దాడి

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో గురువారం నడుచుకుంటూ వెళ్తున్న రాజ్యలక్ష్మి అనే మహిళపై వీధి కుక్కలు దాడి చేసి చిటికెన వేలు కొరికాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం రోడ్డుపై నుంచి నడిచి వెళ్తుండగా ఆమెపై కుక్కలు దాడి చేశాయి. స్థానికులు కుక్కలను తరిమి వేయడంతో ప్రమాదం నుంచి రాజ్యలక్ష్మి బయట పడ్డారు.

అభివృద్ధికి కృషి చేయాలి



వరంగల్ చౌరస్తా: మున్నూరు కాపుల సంక్షేమం, అభివృద్ధికి చొరవ తీసుకోవాలని సంఘం నాయకులు కోరారు. ఈమేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిని మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో సంఘం వరంగల్ జిల్లా నాయకుడు ముత్యాల విజయ్, నాయకులు బుధవారం రాత్రి కలిసి వినతిపత్రం అందజేశారు.

'శ్వేతార్క'లో చండీహోమం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో మాసోత్సవ చండీహోమం గురువారం నిర్వహించారు. యాగశాల నిర్వాహకుడు రోహిత్ ఉపాధ్యాయ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండాలని ఆకాంక్షిస్తూ చండీహోమం జరిపించారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాల వితరణతో పాటు అన్నపూర్ణ భవనంలో అన్నదానం చేశారు. పూజలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ, మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్, సీనమ్మ, అనురాధ, లక్ష్మి, దేవులపల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

కాశిబుగ్గ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా నాగులుప్పుల పాడు ఈదుమూడిలో ఈనెల 7న జరగనున్న మాదిగల మహా జాతరను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుర్రపు శ్యామ్ పిలుపునిచ్చారు. ఈమేరకు జాతరకు సంబంధించిన కరపత్రాలను కాశిబుగ్గ జంక్షన్‌లో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, కుమార్, విల్సన్, సంపత్, భాస్కర్, రాజు, కరుణాకర్, అశోక్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య పోరాటం స్ఫూర్తిదాయకం


హన్మకొండ: దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


దేశాయిపేట: దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు


ఖిలా వరంగల్: సీపీఐ వరంగల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

హన్మకొండ: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పోరాటం స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నాయకులు తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, పులి రజనీకాంత్, చెన్నం మధు, బోయినపల్లి రంజిత్‌రావు, నల్ల స్వరూపరాణి, ఇమ్మడి లోహిత రాజు, జానకి రాములు, నార్లగిరి రమేష్, నయీమొద్దీన్, ఉడుతల సారంగపాణి, కుసుమ లక్ష్మీనారాయణ, బండి రజినికుమార్, పరశురాం, యాదగిరి, పోలెపల్లి రామ్మూర్తి, సల్వాజీ రవీందర్, శరత్‌చంద్ర, బైరపాక ప్రశాంత్, సుమన్, వీరస్వామి, నాగరాజు, లంక రాజ్‌గోపాల్, సోరం రఘు పాల్గొన్నారు.

ప్రజల హక్కుల కోసం ప్రాణాలర్పించారు

దేశాయిపేట: భూమి, భుక్తి, విముక్తి కోసం, ప్రజల హక్కుల కోసం పోరాడి ప్రాణాలర్పించిన దొడ్డి కొమురయ్య చిరస్మరణీయుడని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకట్రాములు మాట్లాడుతూ నిజాం రాక్షస పాలనకు, భూస్వామ్య దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో తొలి అమరవీరుడైన దొడ్డి కొమురయ్య.. తెలంగాణ ప్రజల హృదయాల్లో ఎప్పుడూ నిలిచి ఉంటాడని అన్నారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి నాయకులు రాజు, వెంకన్న, పి.రమేష్, బి.రవీందర్, ఎండీ.కాశీం, దస్రు, ఎస్.కుమార్, ఐలయ్య, మనోహర్, చంద్రశేఖర్, అంజలి, సరళ, గౌషియాబీ తదితరులు పాల్గొన్నారు.


విద్యారణ్యపురి: సీపీఐ హనుమకొండ జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

దొడ్డి కొమురయ్య చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

ఖిలా వరంగల్: నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి వీరమరణం పొందిన దొడ్డి కొమురయ్య చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా డిమాండ్ చేశారు. కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సాయుధ పోరాటంలో పాల్గొని సర్వస్వం త్యాగం చేసిన కుటుంబాలకు పెన్షన్లు ఇవ్వకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవమానించిందని ఆరోపించారు. పోరాటయోధుల త్యాగాలను విస్మరించిన బీఆర్ఎస్, బీజేపీలకు తెలంగాణ త్యాగాల చరిత్ర గురించి మాట్లాడే హక్కులేదన్నారు. దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని వారు కోరారు. అలాగే, వరంగల్ 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్‌లో స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి ఆధ్వర్యంలో కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పనాస ప్రసాద్, గుండె భద్రి, ఎండీ.యాకూబ్, యాకాంతచారి, రామోజ్ వెంకటాద్రి, అనిల్, నవీన్, విజయ్, కోరె కృష్ణ, కుండే రాజు, సమ్మయ్య, ఠాకూర్, సత్యం, అమీర్ ప్రశాంత్, వరుణ్, చీర కవిత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ హనుమకొండ కార్యాలయంలో..

విద్యారణ్యపురి: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పోరాట చరిత్రను పాఠ్యాంశాలల్లో చేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపెల్లి శ్రీనివాస్‌రావు సూచించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, స్వేచ్ఛ సమానత్వం కోసం, నిజాంపాలనకు వ్యతిరేకంగా కొమురయ్య పోరాడారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, బాధ్యులు మారుపాక అనిల్, మద్దెల ఎల్లేష్, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, సారంగపాణి, రవి, శ్రీనివాస్, నర్సయ్య, రమేష్, దేవా, వెంకటేష్, సాంబయ్య, బొట్టు భిక్షపతి, నిమ్మల మనోహర్, రత్నం పాల్గొన్నారు.

దోపిడీ రహిత సమాజం కోసం పోరాడాలి

విద్యారణ్యపురి: దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో దోపిడీ రహిత సమాజం కోసం పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. హనుమకొండలోని సీపీఎం కార్యాలయంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి గురువారం నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సారంపల్లి వాసుదేవరెడ్డి, బాధ్యులు ఎం.చుక్కయ్య, వాంకుడోతు వీరన్న, ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, మల్లయ్య, మంద మల్లేశం, రమేష్, పావయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం


రంగశాయిపేట కళాశాలలో తరగతులు బహిష్కరించి బయటకు వస్తున్న నాయకులు


వరంగల్: పోచమ్మమైదాన్‌లో రాస్తారోకో చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఖిలా వరంగల్: విద్యారంగ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని విద్యార్థి సంఘం ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ ఆరోపించారు. విద్యార్థి సంఘాలు గురువారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని అన్నారు. ఈ సందర్భంగా ఖిలా వరంగల్ మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను మూసివేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల నీట్ పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. దీనిపై జ్యుడిషల్ విచారణ చేయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. యూనివర్సిటీల్లో వీసీల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ రోహిత్, ప్రవీణ్, మోహన్, ఫర్కాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

వరంగల్: వరంగల్ జిల్లా పరిధిలో చేపట్టిన బంద్ విజయవంతం అయిందని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీం నవీద్ తెలిపారు. బంద్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఖండిస్తూ భారతి డిగ్రీ కళాశాల నుంచి పోచమ్మ వరకు ర్యాలీ గురువారం నిర్వహించారు. అనంతరం పోచమ్మమైదాన్ జంక్షన్‌లో రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ రోహిత్, ప్రవీణ్, మోహన్, ఫుర్కాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

రామన్నపేట: ఏఐఎస్‌బీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా హనుమకొండ జిల్లా ఐటీఐ కళాశాల విద్యార్థులు తరగతులు బహిష్కరించి నిరసన తెలిపారని ఏఐఎస్‌బీ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ రోహిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అసమర్థ విధానాల వల్ల నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై వెంటనే జ్యూడీషినల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, ఐటీఐ కళాశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నాయకులు సుమన్, శరత్, వర్షిత్ పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు

మడికొండ: మాస శివరాత్రి పురస్కరించుకొని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం మహాన్యాస పూర్వక ఏకదశి రుద్రాభిషేకం నిర్వహించారు. సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాగశాలలో గణపతి హోమం, రుద్రహోమం, నిర్వహించారు. మాసశివరాత్రి కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కే.శేషుభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, దేవేందర్ శర్మ, సాయి శర్మ, శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, వస్కుల ఉమ, బైరి రాజు, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, భక్తులు సురేష్, రాజేందర్, రవి, వెంకన్న, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

కొణిజేటి రోశయ్య చిరస్మరణీయులు

దేశాయిపేట / రామన్నపేట: మాజీ గవర్నర్, మాజీ ముఖ్యమంత్రి, ఆరుసార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక మంత్రిగా చేసిన అపర చాణిక్యుడు కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయమని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు, రామన్నపేట ఆర్యవైశ్య సత్ర సంఘం అధ్యక్షుడు గట్టు మహేష్‌బాబు కొనియాడారు. రోశయ్య జయంతిని పురస్కరించుకుని వరంగల్ ఆటోనగర్‌లోని బాలుర అంధుల పాఠశాలలో నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో రైస్ మిలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్‌కుమార్, సంఘ సేవకురాలు అనితారెడ్డి, పుల్లూరు మధు, సురేష్, దుబ్బ శ్రీనివాస్, వేదప్రకాష్, మదన్‌మోహన్, సీతారాం, నాగేశ్వర్‌రావు, ఆనంద్, అమర్‌నాథ్, రాజేందర్, శైలజ తదితరులు పాల్గొన్నారు.


కొత్తవాడ అంధుల పాఠశాలకు నిత్యావసరాలను అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘాల నాయకులు

ఆగ్రాలో వరంగల్‌కు చెందిన బంగారం వ్యాపారి మృతి


శిరీష్ (ఫైల్)

వరంగల్ అర్బన్: కాశీ, అయోధ్య దర్శనానంతరం బుధవారం ఆగ్రా చేరుకున్న వరంగల్‌కు చెందిన 11మందిలో ఏడుగురు అనారోగ్యానికి గురయ్యారు. వారిలో ఆరుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, వరంగల్ పిన్నావారి వీధికి చెందిన బంగారం వ్యాపారి ఉప్పల శిరీష్ (55) మృతి చెందారు. మృతుడి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ పిన్నావారి వీధికి చెందిన బంగారం వ్యాపారి ఉప్పల శిరీష్ గతనెల 30న 11 మంది కుటుంబ సభ్యులతో కలిసి కాశీ, అయోధ్య దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆగ్రా సందర్శనార్థం వెళ్లగా వారిలో ఏడుగురు వాంతులు, విరోచనలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని అక్కడే ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా, శిరీష్ బుధవారం మృతి చెందారు. మిగిలిన ఆరుగురు క్షేమంగా ఉన్నట్లు తెలిసింది. మృతుడు శిరీష్ మృతదేహం గురువారం మధ్యాహ్నం పిన్నివారి వీధిలోని స్వగృహానికి చేరింది. ఆస్పత్రిలో చికిత్స పొందిన మిగిలిన కుటుంబ సభ్యులు రాత్రి వరకు చేరుకుని అవకాశం ఉందని బంధుమిత్రులు తెలిపారు. మృతుడు శిరీష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈమేరకు ఆయన మృతికి మృతికి సంతాపం ప్రకటిస్తూ బంగారం, వెండి ఆభరణాల షాపుల యజమానులు బంద్ పాటించారు.

గుడిసెవాసులకు పట్టాలివ్వాలి


వినతిపత్రం అందిస్తున్న సీపీఐ కార్యకర్తలు

కాజీపేట: రెండున్నర దశాబ్దాలుగా గుడిసెలు వేసుకుని నివాసముంటున్న పేద కుటుంబాలకు ఇంటి నివేశన స్థలాలు ఇవ్వాలని ప్రజలు కోరారు. ఈమేరకు తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డికి సీపీఐ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ ఆధ్వర్యంలో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి పట్టాలు ఇప్పించాల్సిన ఆవశ్యకతను కార్యకర్తలు వివరించారు. కార్యక్రమంలో ధర్మసాగర్ మండల కార్యదర్శి కొట్టె వెంకటేష్, దీన, మహేష్, ఎర్ర జయ, పూలమ్మ, సుజాత, మనెమ్మ, చింటు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవే రోటరీ క్లబ్ ధ్యేయం

హన్మకొండ: రోటరీ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా అద్భుతాలను సృష్టిస్తోందని, సేవా కార్యక్రమాలు చేయడమే క్లబ్ ధ్యేయమని రోటరీ క్లబ్ మాజీ డిస్ట్రిక్ గవర్నర్ జవహర్ వడ్లమాని అన్నారు. హనుమకొండ సుబేదారిలోని అనంత భవన్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ 25వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదిని రోటరీ థీమ్ మ్యాజిక్ ఆఫ్ రోటరీగా ప్రకటించినట్లు వివరించారు. రోటరీ సభ్యులుగా ఉంటూ సమాజానికి సేవ చేస్తున్న ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పూర్వ అధ్యక్షుడు అన్నం రవీంద్రనాథ్, కార్యదర్శి శిరీష్ కుమార్, కోశాధికారి నరేష్ గంగోజును అభినందించారు. నూతన అధ్యక్షుడిగా శారు ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శిగా కె.ప్రవీణ్ కుమార్, కోశాధికారిగా అంచూరి విజయ్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు కొంపల్లి ప్రభాకర్, శరత్ బాబు, గార్లపాటి శ్రీనివాస్, నరసింహ యాదవ్ పాల్గొన్నారు.


అతిథులకు జ్ఞాపికలు అందిస్తున్న బాధ్యులు

కాజీపేట దర్గాలో మంత్రి శ్రీధర్‌బాబు


కాజీపేట రూరల్: నాయకులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాజీపేట రూరల్: కాజీపేట హజ్రత్ సయ్యద్‌షా అఫ్జల్ బియాబాని దర్గాను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి, తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా శ్రీధర్‌బాబుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఖుస్రూపాషా గృహంలో శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఖుస్రూపాషా సమావేశమై మైనార్టీల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో భక్తియార్ బియాబాని, పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ కార్యదర్శి ఈవీ.శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్, పార్టీ 48వ డివిజన్ అధ్యక్షుడు రవిప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీధర్‌బాబును కలిసిన నాయకులు

హన్మకొండ అర్బన్: నగరంలోని 59వ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో ఐటీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈమేరకు వారికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి మండల సమ్మయ్య, నాయకులు తాళ్లపల్లి రవీందర్, ఎండీ.అక్మల్, ఎండీ.ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఈఈయూ సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్‌కు పితృ వియోగం

హన్మకొండ: తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ఈఈయూ) -327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ తండ్రి ఇనుగాల జనార్దన్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న జనార్దన్.. హనుమకొండ కొత్తూరు బొక్కలగడ్డలోని చిన్న కుమారుడు ఇనుగాల శ్రీనాథ్ స్వగృహంలో గురువారం ఉదయం తుది శ్వాస విడిచారు. జనార్దన్ పార్థివదేహాన్ని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి, డైరెక్టర్లు వి.తిరుపతి రెడ్డి, అశోక్ కుమార్, సదర్‌లాల్, మధుసూదన్, టీఎస్ఈఈయూ ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, ఆయా యూనియన్ల నాయకులు, అసోసియేషన్ నాయకులు, ఎన్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్లు, మేనేజర్లు, ఎస్ఈలు, డీఈలు, ఎడీఈలు, ఏఈలు సందర్శించి పూలమాల ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జానపద విజ్ఞాన పీఠాధిపతికి సన్మానం



హన్మకొండ కల్చరల్: వరంగల్ తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావును పరిశోధక విద్యార్థులు సన్మానించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆచార్య కోలకలూరి ఇనాక్‌పై పీహెచ్‌డీ చేసిన డాక్టర్ మోహన్, ఎంఫిల్ విద్యార్థి లలిత గురువారం హంటర్‌రోడ్డులోని పీఠంలో బాబురావుకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్యాంధ్రలో ఒక వెలుగు వెలిగిన ఆచార్య కోలకలూరి ఇనాక్ గొప్ప మానవతావాది అని, అందరికి ఆయన మార్గదర్శకుడని అన్నారు.

విద్యార్థి నిజాయితీని కొనియాడిన సీఐ

రామన్నపేట: ఆటోలో ఓ మహిళ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించిన ఓ విద్యార్థి వెంటనే ఆటో డ్రైవర్‌కు సమాచారం అందించి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బాధిత మహిళకు ఫోన్ అప్పగించడంపై సదరు విద్యార్థి నిజాయితీని ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ కొనియాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం నర్సంపేట కొమ్మాలలో శకుంతల అనే మహిళ ఆటో ఎక్కి వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద దిగింది. ఈ క్రమంలో ఆమె తన సెల్‌ఫోన్‌ను ఆటోలోనే మర్చిపోయింది. ఆ సమయంలో అదే ఆటోలో లేబర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న శివ, 9వ తరగతి చదువుతున్న అతని అన్న సాయికృష్ణ.. ఆ సెల్‌ఫోన్‌ను గుర్తించి ఆటో డ్రైవర్ రవికుమార్‌కు తెలిపారు. శివ, సాయికృష్ణ, ఆటో డ్రైవర్ రవికుమార్ ముగ్గురు కలిసి ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించారు. సదరు మహిళకు సమాచారం అందించిన పోలీసులు.. విద్యార్థి శివ చేతుల మీదుగా ఆమెకు సెల్‌ఫోన్‌ను అందజేశారు.


బాలుడి చేతుల మీదుగా మహిళకు సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ శివకుమార్

ఆఫీస్ సబార్డినేటర్లకు పదోన్నతులు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

హన్మకొండ: అర్హులైన ఆఫీస్ సబార్డినేటర్లకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ పంచాయతీరాజ్ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి చాగంటి రవి కోరారు. ఈమేరకు హనుమకొండలోని సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగి ఉండి ఆఫీస్ సబార్డినేట్లుగా 30 ఏళ్లు పని చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలని కోరారు. గత ప్రభుత్వం వీఆర్ఓ, వీఆర్ఏలను తీసుకువచ్చి పంచాయతీరాజ్ శాఖలో భర్తీ చేయడంతో పదోన్నతులు పొందలేక తమకు నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు వేయించాలి



ఖిలా వరంగల్: సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వేద సూచించారు. పిల్లలకు ధనుర్వాతం, పక్షవాతం, కోరింత దగ్గు, కంట సర్పి, మెదడు వ్యాపు, న్యూమోనియా, తట్టు, రూబెల్లా, రేచీకటి, మొదడు వాపు తదితర వ్యాధుల నివారణ టీకాలు వేయించాలని సూచించారు. వరంగల్ రంగశాయిపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, మానవ, బాలల అక్రమ రవాణా నివారణపై గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ వేద మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. టైఫాయిడ్, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా ఇంటింటి సర్వే చేయాలని ఆశ కార్యకర్తలను ఆదేశించారు. కార్యక్రమంలో సుదర్శన్, సుజాత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.